# మాలతీ చందూర్ రచనలు – సమాలోచనం

ఆచార్య జి. అరుణకుమారి,
అధ్యక్షులు, తెలుగుశాఖ,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

## జీవిత పరిచయం:

మాలతీ చందూర్ 1930లో కృష్ణాజిల్లా నూజివీడులో వెంకటేశ్వర్లు, జ్ఞానాంబలకు జన్మించారు. మాలతీ చందూర్ కు ఆరుగురు సహోదరులు. అందరికంటే చిన్నది. మేనమామ చందూరి నాగేశ్వరరావుతో వివాహం జరిగింది. సాహిత్య మండలికి వెళ్ళడంతో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. శ్రీశ్రీ, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, చలం, కొవ్వలి లక్ష్మీనరసింహం, ఎం.యస్. రామారావు మొదలైన వారితోను, డి.కామేశ్వరి, ఆనందరామం, అరవిందాచారి, సక్కుబాయి వంటివారితో పరిచయాలు ఏర్పడ్డాయి. ఏలూరులో కళావీధి అనే సాహిత్య పత్రిక ఉండేది. రేడియోలో రచనలు చదివి వినిపించేవారు. రేడియో స్టేషనులో ఆచంట జానకీరాం, బుచ్చిబాబు, జనమంచి రామకృష్ణ, పి.వి. రాజమన్నారు, మునిమాణిక్యం నరసింహారావు వంటివారిని గమనించారు. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 1952 నుండి స్త్రీల కోసం 'ప్రమదావనం' కాలమ్ నడిపేవారు. వంటలు-వార్పులుతోబాటు, ఇంగ్లీషు నవలలను

పరిచయం చెయ్యడం, విదేశాలకు వెళ్ళినవారి అనుభవాలను రాయడం, స్త్రీలకు సలహాలు కూడా రాసేవారు. ఇవి కొత్తగా పెళ్ళైన అమ్మాయిలకు ఉపయోగకరంగా ఉండేవి.

*పాప* మొదలైన కథా సంకలనాలు పదహారు పైబడి వెలువరించారు. ఈమె నవలలు కొన్నింటిని ఎమెస్కో పాకెట్ బుక్స్ వారు ప్రచురించారు. *నవలా మంజరి* పేరుతో ప్రపంచ ప్రఖ్యాత నవలలను పరిచయం చేశారు. “మంచి విషయ పరిజ్ఞాన నిశితమైన పరిశీలనగల మాలతీ చందూర్ తన రచనల్లో సాంఘిక పరిస్థితులను, సామాజిక కోణాలలో పరిశీలించి ఆలోచనాత్మకమైన నవలలు రాస్తునారు” అని ద్వానా శాస్త్రి తెలుగు సాహిత్య చరిత్రలో పేర్కొన్నారు.

చందూరి నాగేశ్వరరావు జగతి పత్రిక సంపాదకులుగా ఉండి మాలతీ చందూర్ గారి రచనలకు ప్రోత్సాహ కారకులుగా నిలిచారు. నాగేశ్వరరావుగారు ఈమె రాసిన నవలల శీర్షికలను గమనించేవారని, రాతప్రతులను చూసేవారని ముఖాముఖిలో చెప్పుకున్నారు. మాలతీ చందూర్ అనేక అవార్డులను పొందారు. మాదిరెడ్డి సులోచన, సుశీల నారాయణరెడ్డి, వాసిరెడ్డి, రంగనాయకమ్మ, రాజ్యలక్ష్మి, గురజాడ, ఇల్లిందల సరస్వతీ దేవి, పైడి లక్ష్మయ్య, దువ్వూరి సుబ్బమ్మ, గోపీచంద్, లోక్ నాయక్ అవార్డులను అందుకున్నారు. 1992 ఫిబ్రవరి 18 నాడు శ్రీ పద్మావతి మహిళా

విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేటు అందుకున్నారు. *హృదయనేత్రి* నవల రచనకుగాను కేంద్రసాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు.

## సాహిత్యేతర రచనలు:

### ఆదర్శ స్త్రీల సజీవ చిత్రాలు:

అనిబిసెంటు, ఎలిజబెత్ బ్లాక్ వెల్, ఇడా స్కడ్డర్, హెలెన్ కెల్లర్, ఎలిజబెత్ ఫ్రే, ఫ్లారెన్స్ నైటింగేల్, క్వీన్ ఎలిజబెత్, ఎలియనార్ రూజ్ వెల్ట్, మీరాబెన్ మొదలైన ప్రఖ్యాత స్త్రీలను గురించి ఈ గ్రంథంలో వివరించారు.

- **అనిబిసెంటు:** స్వాతంత్ర్య పోరాటంలో కష్టనిష్టురాలు పడి, కారాగార శిక్ష అనుభవించిన వీరవనిత అనిబిసెంటు. హోమ్ రూల్ ఉద్యమాన్ని నడిపింది. భారతీయులకు పరిపాలనా హక్కు కావాలి అని ఆందోళన చేసిన బ్రిటీషు వనిత.
- **ఎలిజబెత్ బ్లాక్ వెల్:** ప్రపంచంలోకెల్లా మొట్టమొదటి లేడీ డాక్టరు. ఆ రోజుల్లో ఓడ ప్రయాణం. వైద్యవిద్యలోకి మహిళ ప్రవేశం గురించి వివరించారు.
- **ఇడా స్కడ్డర్:** రాయవెల్లూరు, గుంటూరులలో సేవచేసిన అమెరికన్ వైద్యులు. ఇడాస్కడ్డర్ తాత ముత్తాతల కాలం నుండి నాలుగు

తరాలుగా భారతావనికి, భారతప్రజలకు దాదాపు 42మంది సేవ చేసారు.

- **హెలెన్ కెల్లర్:** కళ్ళు కనిపించవు, చెవులు వినిపించవు, నోట మాటరాదు. హెలెన్ కెల్లర్ టీచరు యానీ సల్లివాన్. టీచరు కెల్లరుకు కళ్ళు, చెవులుగా ఉంటూ వచ్చింది. వర్షం, గాలి, నీరు...ప్రకృతిని గురించి టీచరు కెల్లరుకు తెలియజెప్పేది. ప్రేమ అంటే ఏమిటో కెల్లర్ కు వివరించగలిగింది. జ్ఞానేంద్రియాలలో మూడింటిని కోల్పోయిన కెల్లర్ ఎంత ఫలవంతమైన జీవితం గడిపిందో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది.
- **ఫ్లోరెన్స్ నైటింగేల్:** సేవాధర్మమే జీవితాదర్శంగా నర్సింగ్ వృత్తిలో ఉండి యుద్ధంలో గాయపడిన సైనికోద్యోగులకు సేవ చేసింది.
- **ఎలిజబెత్ ఫ్రే:** నేరస్థులలో సంస్కరణ కోసం నిరంతర కృషి ద్వారా పునరావాసం కల్పించి నూతన జన్మ కలిగించింది. వృత్తి విద్యలు నేర్పించింది.

వినదగు విషయాలు:

- ట్రెయిలర్ కార్ వాన్ – హిచ్ హైకింగ్ గురించి వివరించారు. జేబులో పైసా లేకుండా ఒక్చోటి నుండి మరొక చోటికి ప్రయాణం చేయడం. ఒక స్త్రీ జర్మనీ నుండి ఇండియాకి వచ్చి ఇండియా అంతా ప్రయాణం

చేసింది. రెండుగదుల ఇళ్ళు చక్రాల మీద పరుగెత్తడం గురించి వ్యాసం చదివి పాఠకులకు పరిచయం చేసారు.

- ఫోటోపడడం, కుట్టుయంత్రం – నాగరికత గల ధనవంతులుగా గుర్తింపును రోజుకు ఒక రూపాయి ఇచ్చి కొనుక్కున్నవారున్నారు.
- ప్రకటనలు(పత్రికలు)– ప్రకటనలు ఆసక్తిగా చదివేవారట. వనస్పతి ప్రకటన గురించి, కోనసీమలో చవులూరించే రుచుల గురించి చిన్న కథ రెండు పేజీల్లో వేసేవారు.
- ఆహారపదార్థాలు ఎలా నిలవ ఉంచాలి అనే దానికి ఒక చరిత్ర చూపించేవారు. నెపోలియన్ ప్రకటన ఇచ్చాడట.
- పాదయాత్ర, తపాళా బిళ్ళల సేకరణ, బైండింగు, విహారయాత్రలు, బకింగ్ హామ్ పాలెస్, అజంతా, ఆత్మహత్యలు, డైరీ రాయడం, నిజమైన సమస్యలు, రోడ్ సైడ్ రోమియోలు మొదలైన విషయాలను చర్చించారు.

## సౌందర్య సాధన:

- ఉన్న అందం, అలంకరణ, ఎంత నిద్ర కావాలి, పగిలిన పాదాలు, నడక తీరు, దురభ్యాసాలు, పళ్ళు–దంతాలు శుభ్రత, వయసు, జాకెట్లు, చోళీలు, చీరెలు, రంగులు, తీరికూర్చుని, అందం–ఆరోగ్యం.

## మహిళలకు మధుర జీవితం:

ఈ పుస్తకంలో 19 శీర్షికలున్నాయి. వివాహ మెందుకు, ఎంతవరకు, పప్పుఅన్నం, అన్యోన్యంగా, భార్యాభర్తలు, చివికి చివికి, అత్తాకోడళ్ళు, స్నేహాలు, మాటపొందిక, సాధింపులు, బద్ధకస్తులు, ఇరుగు పొరుగు, ఎక్కడివక్కడ, పొదుపు, దుబారా, మన సమస్యలు, పనివాళ్ళతో చిక్కులు, చిన్నతనపు భయాలు, పిల్లల పెంపకం.

- **వివాహమెందుకు:** పెళ్ళి చేసుకొని ఆడవాళ్ళందరూ అవస్థలు పడుతున్నవారే కనిపించారు. పెళ్ళి చేసుకోమన్నా చేసుకోదలుచుకోలేదు అని 16/17 ఏళ్ళ అమ్మాయి మాలతిగారికి ఉత్తరం రాసింది. దానికి ఆమె వ్యాసపూరిత సమాధానం ఇచ్చారు. మానవ జీవితం వెలుగు నీడల కలయిక. సినిమాల్లో చూపించినట్టుగా చెట్లెక్కి, గుట్టలెక్కి పాడుకుంటారు జంటలంటే అనేది పచ్చి అబద్ధం. జీవితంలో మధుర క్షణాలు, దుఃఖ పూరిత దినాలు ఉంటాయి. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నా, అన్నీ ఉన్నా వివాహం చేసుకోకపోతే మనసులో మాట చెప్పుకోవడానికి ఒక ప్రాణి కావాలి. స్నేహితులెందుకు కాకూడదు? ఎవరు? స్త్రీతో చేయాలా? పురుషుడితో చేయాలా? చుట్టూ ఉన్న సమాజం వైఖరిని బట్టి నడుచుకోవాలి.

- భార్యాభర్తలు ఒకరి అభిరుచిని మరొకరు గౌరవించుకోవాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి.
- సంస్కారం మగవారిలో రావాలి. ప్రతి పెళ్ళికొడుకు నేను కట్నం తీసుకోను, నా చెల్లెలికి కట్నం ఇవ్వను అనుకుంటే కట్నాల బాధ తగ్గుతుంది.
- పెళ్ళికూతురు కూడా తనలాంటి మనిషేనని, రక్తమాంసాలున్న స్త్రీ అనీ, మనసున్న స్త్రీ అనీ ప్రవర్తిస్తే సమజం బాగుపడుతుంది. చివరగా పాల సముద్రం మథిస్తే ముందుగా హాలాహలం, ఆపై అమృతం వస్తుంది.
- **ఎంతవరకు:** స్త్రీ ఎంతవరకు చదువుకోవాలి అనేది సమస్య. భర్తలు స్త్రీలను ఉద్యోగాలకు పంపాలని, అది సాధ్యం కానపుడు ఇంట్లో ఉండి గృహోపకరణ పనులకు చదువుకున్న విద్యను ఉపయోగించి ఆత్మపరిశీలన చేసుకుంటే మేలని అన్నారు. కథలు, వ్యాసాలు ఎలా రాయాలనే విషయాన్ని కూడా పేర్కొన్నారు.
- **పప్పు – అన్నం:** పెళ్ళి కావలసిన పిల్ల రెండు జడలు వేసుకోవడం వంటి విషయాలను చర్చించారు. మన పెద్దవాళ్ళు కాలంతోపాటు హృదయాల్ని, భావాల్ని కూడా పెరగనిచ్చి చదువుకునే పిల్లల్ని కాలానుగుణంగా చూడడం నేర్చుకుంటే పిల్లల ముందు లేనిపోని మాటలు మాట్లాడవలసిన అవసరం ఉండదు.

- **అన్యోన్యం:** పిచ్చిపట్టుదల, పెంకితనం. సహనమే దాంపత్య జీవితానికి పునాది. పాతవి తవ్వి కెలక్కూడదు. క్షమాగుణం అలవరచుకోవాలి. తాత్కాలికంగా మనం ఓడిపోయినట్టు ఉన్నా అంతిమ విజయం మనదే.
- **భార్యాభర్తలు:** జోక్యం చేసుకునే భర్తలు, ప్రతీ మనిషికీ వ్యక్తిత్వం, అభిరుచీ ఉంటాయి. స్త్రీని భావాలు గల భార్యగా తయారుచేయడం పురుషుని చేతుల్లో ఉంది.
- **చివికి చివికి:** భార్యాభర్తల గొడవలకు సంబంధించిన చర్చ. పట్టరాని కోపంలో "మీరు ఛస్తే ఆ వెంకటేశ్వరుడికి అర్థ మణుగు నూనెతో అఖండ దీపం వెలిగిస్తానని ఒక పెద్ద దణ్ణం పెడుతున్నా" అని అన్న భార్య ఆవేశం తగ్గాక సిగ్గుపడిపోతారు. ద్వేషాని కాగితాల మీద మాట్ల విసురులతో సాగిస్తే సిగ్గుపడాల్సిందే.
- **అత్తాకోడళ్ళు:** గిరులు గీసుకుని అవి దాటి రారు. అందువల్లే మగవారికి బాధలు కలుగుతాయి. కొడుకు సంపాదన, అనుమానం, హక్కు, అసహ్యం, స్వార్థం అనేవి వీరి మధ్య కలహాలకు కారణాలు. ఇద్దరికీ మధ్య కొడుకు సానుకూల పరిస్థితిని కల్పించే వాడిగా ఉండాలి. అత్త తన వయసుకి తగినట్టుగా ఉండాళి. కోడలు చేసే ప్రతి పనినీ వక్రీకరించి చూడకూడదు. సామరస్యం అవసరం.

పై రచనలే కాక మరికొన్ని రచనలు కూడా చేశారు అవి: *నవభారతి, విఖ్యాత పురుషుల జీవిత చిత్రాలు, పిల్లల పెంపకం, నేర్పుగా...ఓర్పుగా, ప్రమాదాలు – మెలకువలు, వంటలు–పిండి వంటలు, సుమధుర వంటలు*

## మాలతీ చందూర్ – సాహిత్య రచనలు:

### కథలు: (లజ్ కార్నర్, కాంఫర్ డాక్టర్)

ఆనందవాణి వారపత్రికలో 'రవ్వలదుద్దులు', భారతిలో 'నీరజ' వంటి కథలు ప్రచురితమైనాయి. మాలతీ చందూర్ రాసిన 'నాలాగా ఎందరో' కథను 1987లో దూరదర్శన్ వారు హిందీ నాటకంగా మలిచారు.

మాలతీ చందూర్ రాసిన మరొక కథ 'లజ్ కార్నర్'. Luzz Corner అన్నది మద్రాసు నగరంలోని ఒక ప్రాంతం. దేశీ పబ్లికేషన్ వారు 'పాప' పేరుతో కథా సంపుటాన్ని ప్రచురించారు. అందులో లజ్ కార్నర్, పాప, తనూ–నీరజ, శానమ్మ, జాలి, విలువెంత, ఏడుకొండలవాడా, జమున వేసిన భారం మొదలైన పదహారుకు పైగా కథలున్నాయి. పాప కథ 1953లో భారతి పత్రికలో అచ్చయింది. Luzz Corner కథలో శ్యామల తండ్రి చేసే పెళ్ళి ఇష్టం లేక ఇల్లువిడిచి సినిమాలో అవకాశం ఇస్తానన్న డైరెక్టరును కలుసుకోవడానికి మద్రాసు పట్టణం చేరుకుంటుంది. కథారంభం మాత్రం ఒక అమ్మాయి(శ్యామల) డైరెక్టరుకు ఫోను చేయడంతో మొదలవుతుంది. ఆ

ఫోను పొరపాటున 2017కి బదులు 2007 కి చేరుతుంది. ఫోను అందుకున్న వ్యక్తి రాంగ్ నెంబర్ అని చెప్పి ఫోను పెట్టేస్తుంటే, తన దగ్గర మళ్ళీ ఫోను చేయడానికి సరిపడా చిల్లర డబ్బులు లేవనీ దయచేసి 2017 నెంబరుకు ఫోను చేసి తాను వచ్చిన విషయం డైరెక్టరుకు చెప్పమని బతిమాలుతుంది. డైరెక్టరు నిద్రపోతున్నారని చెప్పి అసిస్టెంటు ఫోను పెట్టేస్తాడు. అవతలి వ్యక్తి సానుభూతితో పాపం ఆడపిల్ల అని సానుభూతితో చేసేది లేక ఇంటికి తీసుకు వస్తాడు. తల్లికి ఒప్పజెబుతాడు. విషయం తెలుసుకున్న తల్లి అభిరుచులు కలిసాయని కొడుకు(శేఖరం)తో శ్యామల వివాహం చేయడానికి నిశ్చయించుకొని శ్యామల తండ్రికి ఫోను చేస్తుంది.

అనువాద నవలలు:

| క్రమ సంఖ్య | అనువాద నవల పేరు | మూల నవల/భాష | మూల రచయిత |
|---|---|---|---|
| 1. | జంట నగరాలు | A Tale of Two Cities/ఇంగ్లీషు | ఛార్లెస్ డికెన్స్ |
| 2. | ప్రణయ సౌరభం | On the Eve/రష్యన్ | తుర్గనీవ్ |
| 3. | గోప వనిత | Tess of the D'Urbervilles/ఇంగ్లీషు | థామస్ హార్డీ |
| 4. | దిక్కులేని దీనులు | Les Miserable/ఫ్రెంచి | విక్టర్ హ్యూగో |

| | | | |
|---|---|---|---|
| | | | |
| 5. | మంకెన పువ్వు | Scarlet Letter/ఇంగ్లీషు | నెథానియల్ హతోర్న్ |
| 6. | కొన్ని సమయాలు కొందరు మనుషులు | సిల నేరంగళిల్ సిల మనిదర్ గళ్/తమిళం | జయకాంతన్ |
| 7. | ఓ మనిషి కథ | ఒరు మనిదన్ కతై | శివశంకరి |

మాలతీ చందూర్ నవలలు కన్నడ భాషలోకి అనువదింపబడ్డాయి. 'ఆలోచించు' నవలను ఆంగ్లంలోకి అనువదించి నాగపూర్ హితవాద పత్రికలో ప్రచురించారు. 'సద్యోగం' నవల తమిళ, గుజరాతీ, హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువదింపబడింది. హృదయనేత్రి నవల ఆంగ్లంలోకి అనువదింపబడింది.

ఇంగ్లీషు నవలలకు తెలుగులో ఇతివృత్తాన్ని సంక్షిప్తంగా అందించారు. స్వాతి మాస పత్రికలో 'పాతకెరటాలు' పేరుతో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నవలలను పరిచయం చేసారు. అనేక భాషలకు చెందిన నవలలను నవలా మంజరి పేరుతో పాఠకలోకానికి ఆరు సంపుటాలుగా పరిచయం చేసారు. అనువాద సాహిత్యంలోను ప్రముఖ పాత్ర వహించారు. పేర్లను బట్టి, వస్తువును బట్టి మూల రచనను గుర్తు పట్టాలిగాని అనువాద నవలగా గుర్తు పట్టడానికి వీలులేనంతగా వీరి అనువాదాలు కొనసాగాయి.

తమిలంలో జయకాంతన్ రాసిన 'సిల నేరంగళిల్ సిల మనిదర్గళ్' నవలను మాలతీ చందూర్ తెలుగులోకి అనువాదం చేసారు. 'కొన్ని సమయాలు, కొందరు మనుషులు' పేరుతో. శివశంకరి రాసిన 'ఒరు మనిదన్ కథై' నవలను 'ఓ మనిషి కథ' పేరుతో అనువదించారు. 'సిల నేరంగళిల్ సిల మనిదర్గళ్' నవలలో ఒక ఆడపిల్ల జీవితంలో జరగరాని సంఘటన జరిగినపుడు, ఆ విషయం దాచి బిడ్డ జీవితాన్ని ముందుకు నడిపించి ఉంటే బాగుండేది కానీ, తల్లి విషయాన్ని బహిర్గతం చేసి ఆ పిల్ల జీవితాన్ని వీధిపాలు చేస్తుంది. ఒక పత్రికా విలేఖరి ఈ సంఘటనకు స్పందించి తల్లి పిల్లను జనం మధ్యలో రచ్చ చేయకుండా గుట్టుగా ఉంటే బాగుండేదని పత్రికలో పేర్కొన్నాడు. అది చదివిన ఆ వ్యక్తి క్షణిక ఆవేశంలో పాడుచేశానని పశ్చాత్తాపపడతాడు. ఆ అమ్మాయికి స్నేహితుడవుతాడు, ఇంటికి తీసుకువెళ్ళి భార్యా పిల్లలకు పరిచయం చేస్తాదు. మనసులేని  మనుగడ సాగిస్తున్న అతనికి ఈమె పరిచయం కొంత కాలం ఊరట కలిగించినా తరువాత నా జీవితంలోకి ఎందుకొచ్చింది, ముందే బాగున్నానని అనుకుంటాడు. ఆమె కొంత కోలుకున్నా మళ్ళీ తల్లి అతనితో స్నేహం చేయకూడదని అన్నని పంపిస్తుంది. తండ్రి లేకపోవడం, పేదరికం ఇవన్నీ కారణాలుగా నిలిచినపుడు నిలదొక్కుకోవాలని ప్రయత్నించే ఆడపిల్లల జీవితం, సమాజ పరిస్థితులకు, సమస్యలకు బలైపోయే జీవితాలు, ఊగిసలాడే మనస్తత్వాలు మన కంటికి కనిపిస్తాయి. ఇందుకు భిన్నంగా మాలతీ చందూర్ రాసిన 'కాంచన మృగం'

నవల కనిపిస్తుంది. సుందరమ్మ, కూతురు పంకజం చేసిన తప్పును కప్పి పుచ్చి ఆమెకు, తప్పు చేసిన వ్యక్తికీ మెరుగైన జీవితాన్ని అందిస్తుంది. సుందరమ్మ ఉన్నతమైన వ్యక్తిగా, తల్లిగా నిలుస్తుంది.

## మాలతీ చందూర్ – నవలలు:

### చంపకం – చదపురుగులు:

1950లో మాలతీ చందూర్ రాసిన మొదటి నవల చంపకం – చదపురుగులు. నవలలో ప్రధాన పాత్ర అయిన చంపకం నవల చివరకు ఆత్మహత్య చేసుకుంటుంది. చంపకం జీవితంలోని మూడు దశలు ఆమెను ఈ నిర్ణయం వైపు ప్రేరేపించాయి. తండ్రి పున్నయ్య సామాన్య రైతు. అకస్మాత్తుగా మరణించడం వలన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల పాలై ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కుటుబంలో ఎవరి సమర్థతకు తగ్గట్టు వారు ప్రయత్నాలు చేసారు. పిల్లలు అందరిలోకీ అందమైనదీ, గాత్రశుద్ధి ఉన్నదీ, రచనా వ్యాసంగం చేయగలదీ పంకజం. ఆమె మీద కుటుంబ భారం పడడం నవలలోని వస్తువు. చంపకానికి సంగీతం ఎందుకని మాన్పించడం, హీరాలాల్ చేయదల్చిన సాయాన్ని ఆమెకు తెలియకుండానే మాన్పిచడం, భగవద్గీతను దూరం చేయడం మొదటి ఎత్తు. రెండవ దశలో ఆమె సంపాదన ఎటూ పోకుండా తల్లి, అన్న, చెల్లెలు అనుభవించడం, ఆమె సౌందర్యానికి అసూయపడి కమల లావెండర్ సీసాలో ద్రావకం(యాసిడ్) పోయడం, దాని

వలన పంకజం ముఖం వికృతం కావడం, వివాహం చేసుకోవాలనుకున్న వ్యక్తికి తానే దూరం కావడం. జీవితంలో నిలదొక్కుకునే ప్రయత్నంలో భాగంగా కఠినంగా వ్యవహరించడం, కుటుంబంలో అందరికీ ఎవరో ఒకరు తోడు ఉన్నా తనను ఒంటరిగా పరిగణించడం, తనకెవరూ లేరనే భావన, చివరకు తల్లి కూడా తనకు లేదనే భావన చంపకం ఆత్మహత్యకు కారణం అయింది. ఒక వ్యక్తికి ఎదగగలిగిన సమర్థత ఉన్నప్పటికీ కుటుంబంలోని వ్యక్తులు, పరిస్థితులు అనుకూలించని సందర్భాలు ఈ నవలలో కథావస్తువు.

- హీరాలాల్ ద్వారా వచ్చిన అవకాశాన్ని చంపకం తల్లి రత్నమ్మ, అన్న సత్యం నిశ్శబ్దంగా జారవిడిచారు. చంపకాన్ని ఎదగనివ్వకుండా చేసారు.
- చంపకానికి విద్యుక్త ధర్మం, ఆత్మత్యాగంతోనే తృప్తి. కానీ ఆమె ప్రయత్నానికి ఫలితం ఇంటివారి నుండి హేళన, నిర్లక్ష్యం.
- చంపకం కళాహృదయాన్ని, మనోవికాసాన్ని, మనశ్శాంతిని నాశనం చేశారు. చివరకు ఆమె బుద్ధి ఎదురు తిరిగి ఎదగాలనుకుంది.
- మొదటి చంపకంలో చిలిపితనం, రెండో చంపకంలో దైన్యం, మూడో చంపకంలో తిరుగుబాటు కళ్ళలో దాక్కున్నాయి.

- ఇంట్లో వారందరికీ చంపకం అంటే జెలసీ. చంపకం అందవిహీనంగా మారడం వారి జెలసీని కొంత తృప్తి పరిచింది. అదే చంపకంలో ఆలోచనను కలుగజేసి రక్తసంబంధం బూటకంలా కనిపించి ఇంట్లో వారందరూ తమ అవసరాల కోసం తన చుట్టూ తిరుగుతున్నారని మండిపడింది.
- తల్లి, అన్న తనకు హీరాలాల్ అందజేయాలనుకున్న చేయూతని స్వార్థంతో తనకు తెలియనివ్వలేదని, కుటుంబంలో ఒంటరిదై అసూయతో చేసే పనులకు బలైపోయిన స్త్రీ జీవితం.
- మొదటి చంపకంలో చిలిపితనం, రెండో చంపకంలో దైనయం, మూడో చంపకంలో తిరుగుబాటు కనిపించినా, నాల్గో చంపకంలో ఏకాకితనం ఆత్మహత్యకు కారణమయింది.
- మధ్యతరగతి కుటుంబాలలో ఆడ పిల్లలకు అల్లికలు, కుట్లు, సంగీతం వంటివి నేర్పించేవారు. వాటిపట్ల సమాజంలో ఉండే అవగాహన, తల్లి కొడుకు, కూతుళ్ళ మధ్య చూపించే వివక్ష కనిపిస్తుంది. నవలా నాయిక అయిన చంపకానికి సౌందర్యం, రచనా వ్యాసంగం, అనువాదం పట్ల ఉన్న అవగాహన ప్రమదావనాన్ని తలపిస్తుంది.

## కలల వెలుగు:

సినిమా రంఅనికి చెందిన రామచంద్రం బాగా పేరు, డబ్బు గడించాడు. రవణమ్మతో పెళ్ళి, ముగ్గురు పిల్లలు. గయ్యాళి, డబ్బు పిచ్చి ఉన్న భార్యతో సంసారం గడిపాడు. చదువు, సమాజంలో హోదా ఉన్న యశోదతో సినిమా శతజంయంతి ఉత్సవంలో పరిచయం కలిగింది. వివాహానికి అసమ్మతిని తెలిపింది. తమ సంబంధాన్ని రహస్యంగా ఉంచడానికి సిద్ధపడింది. కాని ప్రేమకు ప్రాధాన్యత లేదు. మూడవ స్త్రీ పద్మలత. తల్లి సినిమాలలో అవకాశం ఇప్పిస్తాడని పద్మలతను రామచంద్రంతో చేర్చింది. పద్మలత తన దగరున్న డబ్బును రామచంద్రంకు అందజేసింది. కళాభిమాని, ప్రేమమూర్తి అయిన పద్మలత బజారుమనిషిగా గుర్తింపు పొందింది. రామచంద్రం జబ్బు పడినపుడు సేవలు చేసింది. అతడు మరణించిన తరువాత హక్కుతో భార్య, పద్మలత మీద ఉన్న కోపంతో యశోద, రవణమ్మకు చేదోడు వాదోడుగా నిలిచి సేవచేసినప్పటికీ పద్మలతకు రామచంద్రంను చివరిసారిగా చూడడానికైనా అనుమతించరు. పద్మలత పేరుమీదగా రాసిన ఇల్లు ఆమెకు చెందేట్టుగా చేయమని స్నేహితుడు మహేశ్వరరావుని ఉత్తరం ద్వారా కోరాడు.

- సాంఘిక వ్యత్యాసాలు రూపుమాపి ప్రేమానురాగాల పునాదుల మీద మానవ సంబంధాలు నిలదొక్కుకోవాలని రచయిత్రి అభిప్రాయం.

## రేణుకాదేవి ఆత్మకథ:

ఇది చిత్రరంగంలోని ఒక కథానాయిక జీవితానికి ప్రతిబింబం. రేణుకాదేవి తండ్రి బాల్యంలోనే చనిపోవడం వలన తల్లి కుటుంబ పోషణ భారాన్ని వహిస్తుంది. రేణుకకు సినిమా రంగంలో అవకాశం రావడం, దబ్బు సమకూరడం వలన తల్లి, అన్న డబ్బు వ్యవహారాలు చూసుకుంటారు. ఇంట్లోని ఆంక్షలు, ఆక్షేపణల నుండి బయట పడడానికి సిస్నిమా రంగంలోని రచయితను ప్రేమించి పెళ్ళి చేసుకుంటుంది. భర్త అనిల్ కు అవకాశాలు తగ్గి రేణుకకు అవకాశాలు పెరగడంతో అసూయ, ఈర్ష్య అతనిలో పెరుగుతాయి. అనిల్ తన అక్కని, మేనకోడలిని, రేణుక తల్లిని, అన్నని ఇంటికి తీసుకువచ్చి అందరూ సుఖంగా జీవితాలను కొనసాగిస్తారు. రేణుక కష్టం మీద జీవనం సాగిస్తారు. ఈమె పేరుతో అప్పులు చేస్తాడు. భర్తకి, అక్కకి సంబంధం ఉందని తెలిసి మానసిక క్షోభను అనుభవిస్తుంది. తత్ఫలితంగా తండ్రి వారసత్వంగా ఇచ్చిన గుండెజబ్బుకు గురౌతుంది. లాయర్ ని కలిసి తన ఆస్తి భర్తకు దక్కకుండా హాస్పిటల్ కి, అనాథ శరణాలయానికి రాస్తుంది. రేణుక చచ్చి సాధించింది.

ఈ నవల ఫ్లాష్ బ్యాక్ మెథడ్ లో సాగుతుంది. రేణుక డాక్టరుకి తన ఆత్మకథను చెబుతుంది. దాక్టర్ల మధ్య జరిగిన సంభాషణాలో రేణుక హాస్పిటల్ కి ఇచ్చిన విరాళానికి కారణాలను సూచిస్తాడు డాక్టరు. "పెద్ద పెద్ద ఆస్తులని సంఘాల కోసం ఇచ్చేవారు వారి వారి జీవితానుభవాలని బట్టి ఇస్తారుకాని సంఘంలో మనుషులు సుఖపడతారని ఇవ్వరు. చుట్టూ పెరిగిన పరిసరాల మీద కసి కొద్దీ అలా చేస్తారు. బయటపడ్డ వాళ్ళ మేలు కోరి చేస్తారా? లేక తమ ఆత్మ సంతృప్తి కోసం చేస్తారా? అంటే ఆత్మతృప్తి కోసమే అంటాను" అని డాక్టరు అక్కడకు వచ్చిన డాక్టరు స్నేహితులతో అంటాడు. ఎందుకు ఆస్తులు సమాజానికి, సంఘాలకు రాస్తారు అనే ప్రశ్నకు సమాధానంగా రచయిత్రి ఈ రేణుకాదేవి ఆత్మకథను రచించారు.

- మాదిరెడ్డి సులోచన అభినేత్రి నవలలో నాయిక రాణి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటుంది. సినిమా రంగ ప్రవేశం చేసిన నాయిక పెళ్ళి చేసుకుంటుంది. భర్త, బంధువులు అందరూ మోసం చేస్తారు. ఆమె మరణం తరువాత ఆస్తి అంతా భర్త పేరు మీద ఉన్న వీలునామా దొరుకుతుంది. ఆత్మహత్య చేసుకుందని నమ్మిస్తారు. నిజానిజ భర్త ఆమెకు నిద్రమాత్రలు డోసు ఎక్కువగా ఇస్తాడు.

- రావూరి భరధ్వాజ 'పాకుడు రాళ్ళు' నవలలో సినిమా రంగ ప్రవేశం చేసిన నాయిక మంజరి. ఆవిడ నడవడిక సరిగా ఉండదు. వ్యక్తిత్వాన్ని వదిలి గొప్పనటి అనే స్థాయికి చేరింది. అనాథగా వేశ్యాగృహంలో పెరిగింది, ఆలంబన దొరకలేదు. సమాజం మీద కసి పెంచుకుంది. ఆమెను ఎందరో మోసం చేశారు. ఆమె కూడా కసితో ప్రొడ్యూసర్లను, హీరోలను ఏడిపిస్తుంది. అవకాశం దొరికినపుడు నేల రాస్తుంది. వాడబడింది, వాడింది చివరకు పతనమయ్యింది.

## శిశిర వసంతం:

తనసోదరిపడే నరకయాతన చూడలేక కాన్సర్ కోరల్లో ఎందరో స్త్రీలు దేహయాతన పడుతున్నారనే సత్యం సాక్షాత్కారమై డా. ముత్తులక్ష్మీరెడ్డి కాన్సర్ హాస్పిటల్ నిర్మించింది. ఒక సామాన్య స్త్రీ నెలలు నిండి పురుటి నొప్పులు పడుతూ మగడాక్టరుతో కాన్పు చేయించుకోలేక ప్రాణాలు పోగొట్టుకున్న నిండు చూలాలును చూసిన ఇడా స్కడ్డర్ రాయవెల్లూరులో గర్భిణీ స్త్రీల కోసం హాస్పిటల్ నిర్మించింది.  నిజామ్ కోడలు నీలోఫర్ తన దగ్గర పనిచేసే ఉన్నిసా కాన్పులో మరణించినందుకుగాను నోలోఫర్ హాస్పిటల్ ను ఏర్పరిచింది.

శిశిర వసంతం నవలలో అనంతు తన వ్యక్తిగత బాధ నుండి ఎదిగి విశ్వమానవత కొరకు పాటుపడతాడని డాక్టర్ నీరజ ఆశించి అతడికి అనుకూలంగా స్పందించి మార్గం చూపించింది. మనిషి తన బాధని విశ్వంలోని విశ్వంలోని ప్రతి ఒక్కరి బాధగా అనుకున్నపుడు వ్యక్తి తన పరిధి నుండి ఎదిగి విశ్వమానవత్వం కొరకు పాటుపడినపుడు ఒక కాన్సర్ హాస్పిటల్ ఒక లెప్రసీ ఇనిస్టిట్యూట్ రూపుదిద్దికుంటాయి. వ్యధ నుండి సేవా తత్పరతవైపు వ్యక్తిని మళ్ళింపజేసింది డా. నీరజ. మనిషికి దయ, జాలి, ప్రేమ ఉంటే చాలు.

అనంతులి కుక్కి మెడ, కొంత గూని ఉంది. అనంతు పిన్నికి కాన్సర్. ఆ బాధ ఒకవైపు అయితే వారి జ్ఞాపకాలు మిగిలిన వారిని మరింత బాధపెడతాయి. భార్య కాన్సర్ బారినపడి చనిపోవడంతో అనంతు బాబాయి ఇల్లు వదిలి ఎటో వెళ్ళిపోయాడు. వ్యాధికన్నా దీని ప్రభావం భయంకరమైనది. కాన్సరు వ్యాధితో బాధపడే సంధ్యని డాక్టరు అనంతు వివాహం చేసుకోవాలని కోరుకోవడం, సంధ్య ఇద్దరు పిల్లలని కనాలని ఆశపడడం, వ్యాధిగ్రస్త అయిన స్త్రీ తన జీవితాన్ని అనుకూలంగా మలుచుకోవాలని తాపత్రయ పడడంఈ నవలలోని ప్రధానాంశాలు. అనంతు వైద్య పరిశోధనలో సంధ్య ఒక అంతర్భాగం. ధైర్యం రోగికి గొప్ప ఔషధం.

పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవడం ఎలా అని సంధ్య నుండి నేర్చుకోవచ్చు.

కాన్సర్ వ్యాధిగ్రస్తుల కుండే భయాలు, లక్షణాలు, కేన్సర్ హాస్పిటల్ నిర్మాణాల వెనుక ఉన్న స్ఫూర్తి...మొదలైన అంశాలను రచయిత్రి వివరించారు.

కాంచనమృగం:

పంకజం, ఆనందరావులు వయసులో తప్పుచేసిన కారణంగా పుట్టిన పిల్లవాడిని మరియమ్మకిచ్చి, కొంత డబ్బిచ్చి, పెంచమంది సుందరమ్మ. ఆనందరావుని ఓదార్చి తప్పు చేశాననే భావన నుండి తప్పించి ఎమ్.ఏ. చేయమని ప్రోత్సహించింది. దారితప్పిన కూతురు పంకజానికి పురుడుపోసి ఆయాకి బిడ్డనిచ్చి తరువాత వచ్చి తీసుకెళతానని, పెంచుతానని మాట ఇస్తుంది. ఆయా ఎస్తేరుకి రెండు రూపాయలకి పిల్లవాడిని అమ్ముతుంది. సుందరమ్మ సంస్కారవంతురాలు, ఆలోచనా శక్తిగలది. జరిగిన తప్పు వలన ఎవరి జీవితాలు తలకిందులు కాకుండా పరిష్కరించింది. సుందరమ్మగారు గుండె నెప్పితో హాస్పిటల్లో చేరింది. నర్సు ఎలిజబెత్ తమ్ముడు రాబీని చూసి అతని చేతికున్న ఆరువేళ్ళు, తొర్రి పెదాలు చూసి ఏదో ఆవేశానికి గురై మెడలోని చంద్రహారాన్ని ఆ పిల్లవాడి మెడలో వేస్తుంది. డిశ్చార్జి కావలసిన సుందరమ్మ కార్డియాక్ అరెస్టుతో మరణిస్తుంది. సుందరమ్మ చంద్రహారాన్ని

రాబీ మెడలో ఎందుకు వేసింది అనే అన్వేషణే కాంచనమృగం. డాక్టరు ప్రభాకరమూర్తి, అతని స్నేహితుడు సాహిమూర్తి కలిసి మరణించిన సుందరమ్మ చేసిన పనికి తగిన కారణాన్ని, మానవ స్వభావాన్ని అన్వేషించారు. మానవ హృదయంలోని అగాధాలను చూడాలని అన్వేషించారు. సుందరమ్మ ఒక మిష్టరీని క్రియేట్ చేసింది. రాబీకి చంద్రహారం ఎందుకిచ్చింది అనేది మిష్టరీ. దానిని ఛేదించే క్రమంలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. దానికి పరిష్కారంగా దొరికిన కారణం సుందరమ్మ కూతురు ఆనందరావు ప్రేమలో పడి కన్న సంతానంగా తెలుస్తుంది. కథ అనేక మలుపులతో పంకజానికి తెలిసే సంఘటనలు, ఆనందరావుకి తెలిసీ, తెలియని విషయాల మధ్య నడుస్తుంది.

సుందరమ్మ కోడలు మాధవి ఎలిజబెత్ ను అనుమానించడం, రాబీ రావుగారికిగానీ, ఆయన చెల్లెలికిగానీ, రావుగారి కొడుకులకుగానీ కలిగి ఉండొచ్చనే అనుమానం కలగడం...రకరకాల ఆలోచనలతో రామాపురం వెళ్ళిన ప్రసాద్, మిషన్ ఆసుపత్రికి తల్లీకూతుళ్ళు వచ్చారని, కూతురు ఆరువేళ్ళున్న కొడుకును కన్నదనే వివరాలు మరియమ్మ ద్వారా తెలుసుకుంటాడు. మిగిలిన వివరాలు ఆనందరావుని కలుసుకుని తెలుసుకుంటాడు. పంకజంతో మాట్లాడినపుడు చదువుకున్న స్త్రీగా, ధైర్యవంతురాలిగా సమస్యను ఎదుర్కొంటుంది. రాబీపై తనకు మమకారం

లేదని చెప్పింది. డాక్టరు దగ్గర నుండి చంద్రహారాన్ని తీసుకుని సుందరమ్మగారే ఆ నగని తన కిచ్చారని, ఎలిజబెత్ కి అందజెయ్యమన్నారని కుటుంబ సభ్యులందరికీ చెప్పి ఎవరికీ నింద రాకుండా చేసింది. *సిల నేరంగళిల్ సిలమనిదర్గళ్* నవలలోని తల్లి పాత్ర చేయలేని పనిని కాంచనమృగంనవలలోని సుందరమ్మగారు చేయడం విశేషం. తల్లి పాత్రలో ఉండవలసిన సుగుణాన్ని ఈ చూపించారు. *సిల నేరంగళిల్ సిలమనిదర్గళ్* నవలలో రచయిత అయిన విశ్వంభర శర్మ 'గంగ' కథను అగ్నిప్రవేశం కథగా రాసి తల్లి ఇలా చేసి ఉంటే ఒక ఆడపిల్ల జీవితం బాగుపడేదని సూచిస్తాడు. మాలతీ చందూర్ ఆ సూచనను కాంచనమృగం నవలలో పాటించినట్టుగా కనిపిస్తుంది. జయకాంతన్ తమిళంలో రాసిన *సిల నేరంగళిల్ సిలమనిదర్గళ్* నవలను మాలతీ చందూర్ తెలుగులోకి అనువదించారు. రంగనాయకమ్మ *దొంగతల్లిదండ్రులుంటారు జాగ్రత్త* నవల కాంచనమృగం తరువాత వచ్చింది. రెండు నవలలు పాఠకులను ఆకర్షించాయి. రంగనాయకమ్మ నవలలో తల్లిదండ్రులు పెద్దకూతురు చదువులో ఎదగడంలో శ్రద్ధ చూపరు. కొడుకు మీద ప్రేమ, రెండో కూతురు డబ్బున్న వాడిని పెళ్ళి చేసుకుందని ఆకర్షణ. పెద్ద కూతురు చదువుకుంది. తన కాళ్ళమీద నిలబడి టీచరు ఉద్యోగం చేసి చదువుకుంటుంది. భర్త హింసలకు లోనవుతుంది. కానీ తల్లిదండ్రులు పట్టించుకోరు. భర్తను వదిలేస్తుంది/వదిలించుకుంటుంది. కూతురితో పాటు విడిగా ఉంటూ,

అభ్యుదయ భావాలున్న వ్యక్తిని పెళ్ళి చేసుకుంటుంది. స్త్రీవాద ధోరణులున్న నవల.

- నవలలో సుందరమ్మ పాత్ర పరిపూర్ణంగా కనిపిస్తుంది. తన సామర్థ్యం మేరకు తన కుటుంబాన్ని ముఖ్యంగా తల్లిగా పంకజాన్ని కాపాడింది. పకంజం కొడుకు అయిన రాబీకి తన బంగారు నగ ఇవ్వడం ద్వారా తన కర్తవ్యాన్ని పూర్తి చేసుకుంది. తల్లిగా సుందరమ్మ పాత్ర అంత పరిపూర్ణంగా కనిపిస్తుందో పంకజం పాత్ర అంత అపరిపూర్ణంగా కనిపిస్తుంది. రచయిత్రి సుందరమ్మ పాత్ర చిత్రణ పట్లే ఎక్కువ శ్రద్ధ కనబరిచినట్లు అనిపిస్తుంది. తన తప్పు వలన కుటుంబంలో శాంతికి భంగం కలగకూడదని ఆలోచించగలిగైన పంకజం, అదే తప్పుకు బలైపోయిన రాబీ పట్ల తనకగల బాధ్యతను(ప్రేమను కాదు) వ్యక్తం చేయకపోవడం పంకంజం పాత్రలోని అపరిపక్వతను వ్యక్తీకరిస్తున్నది.

## మాలతీ చందూర్ నవలలు:

| క్రమ సంఖ్య | నవల పేరు | అచ్చయిన సంవత్సరం |
|---|---|---|
| 1. | చంపకం–చదపురుగులు | 1950 |
| 2. | రేణుకా దేవి ఆత్మకథ | 1956 |
| 3. | బ్రతక నేర్చిన జాణ | 1962 |

| | | |
|---|---|---|
| 4. | రెక్కలు–చుక్కలు | 1979 |
| 5. | రాగం–అనురాగం | 1981 |
| 6. | ఏమిటీ జీవితాలు | 1981 |
| 7. | ఆలోచించు | 1982 |
| 8. | కర్పూర పరాగం | 1983 |
| 9. | భూమిపుత్రి | 1983 |
| 10. | మనసులోని మనసు | 1983 |
| 11. | మధుర స్మృతులు | 1983 |
| 12. | కలల వెలుగు | 1984 |
| 13. | క్షణికం | 1984 |
| 14. | సద్యోగం | 1984 |
| 15. | లావణ్య | 1984 |
| 16. | రాగరక్తిమ | 1984 |
| 17. | మేఘాల మేలిముసుగు | 1984 |
| 18. | ఎన్ని మెట్లెక్కినా | 1984 |
| 19. | కృష్ణవేణి | 1985 |
| 20. | జయ–లక్ష్మి | 1985 |
| 21. | ఏది గమ్యం? ఏది మార్గం? | 1985 |
| 22. | వైశాఖి | 1986 |
| 23. | కాంచనమృగం | 1986 |
| 24. | హృదయనేత్రి | 1993 |

| | | |
|---|---|---|
| 25. | శతాబ్ది సూరీడు | 2001 |
| 26. | శిశిర వసంతం | 2001 |

## వివాహేతర సంబంధాలను చిత్రించిన నవలలు:

| క్రమ సంఖ్య | నవల పేరు | సమస్య స్థితి | పరిష్కారం | సందేశం |
|---|---|---|---|---|
| 1. | ఆలోచించు | వివాహేతర సంబంధం. మూర్తి, లలిత(భార్య), సుజాత | సుజాత పై చదువులు చదివి విదేశాలకు వెళ్ళిపోతుంది. | రెండవ భార్యగా సమాజం అంగీకారం. కుటుంబం స్త్రీకి ప్రధానం. తాత్త్విక ఆలోచన వలన సంసారం చక్కదిద్దికోవడం |
| 2. | ఎన్ని మెట్లెక్కినా | వివాహేతర సంబంధం. అవధాని–లీల(భార్య). శకుంతల(ప్రియురాలు), అనసూయ(ప్రియురాలు) | లీల ఆత్మస్థైర్యంతో చదివి వికలాంగులకు సేవ చేస్తుంది. శకుంతల | |

| | | | | |
|---|---|---|---|---|
| | | | ఆత్మహత్య చేసుకుంటుంది. అనసూయ దూరంగా తొలగిపోతుంది. | |
| 3. | ఏమిటీ జీవితాలు | రాజగోపాల్– కృష్ణవేణి(భార్య), సురేఖ | రాజగోపాల్ సంసార జీవితం పట్ల నిరాసక్తతో భార్యను వదిలి సురేఖతో సహజీవనం చేస్తాడు. | సురేఖ గుండెపోటుతో చనిపోతుంది. కృష్ణవేణి తిరిగి రాజగోపాల్ జీవితంలోకి ప్రవేశించి సంసారాన్ని చక్కదిద్దుకుంటుంది. |
| 4. | రెక్కలు – చుక్కలు | వాసుదేవరావు– అతని భార్య, జానకి అనే అమ్మాయి | జానకి ఆత్మహత్యకి కారణం తల్లిదండ్రులు, ప్రేమించిన వీరభద్రం, వాసుదేవరావు | వాసుదేవరావు పిచ్చివాడవుతాడు. అందరూ జీవితాలను కోల్పోతారు. |

| | | | | |
|---|---|---|---|---|
| | | | మామగారు | |